www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 1 డిసెంబర్ 2023
5
చిత్తూరు



కీచకునికి 8ఏళ్లు జైలుశిక్ష

తీర్పును వెలువరించిన చిత్తూరు కోర్టు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

9 సంవత్సరాల బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి ఫోక్సో చట్టం కింది ఎనిమిది సంవత్సరాలు జైలు శిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ ఫోక్సో సెక్షన్ జడ్జి శాంతి తీర్పును వెలువరించారు. కేసు పూర్వపరాలిలా ఉన్నాయి. చంద్రగిరి పోలీసు సబ్‌డివిజన్, తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలో 2020 జూన్ 6వ తేదీ తిరుచానూరు ఎస్‌విపి కాలనీకి చెందిన నాథముని (40) తన కుమార్తె పుట్టినరోజు వేడుకకు ఇంటి చుట్టుపక్కల పిల్లల్ని ఆహ్వానించాడు. పుట్టినరోజు వేడుకల సందడిలో తొమ్మిది సంవత్సరాల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు వచ్చింది. ఈ మేరకు తిరుచానూరు పోలీసు స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తూ నిందితుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి, ఛార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించారు. చిత్తూరు పోక్సో కోర్టు జడ్జి ఎన్.శాంతి ముద్దాయి నాథమునిని దోషిగా తేలుస్తూ ఎనిమిదేళ్లు కఠిన కారాగారశిక్ష, మూడువేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. తిరుచానూరు సిఐ శివప్రసాద్‌రెడ్డిని ఎస్‌పి పి.పరమేశ్వరెడ్డి అభినందించారు.





'రెవెన్యూ' కనుసన్నల్లోనే...

చెరువు పూడ్చి దురాక్రమణ

ప్రజాశక్తి - యర్రావారిపాలెం

మండలంలోని ఉదయమాణిక్యం పంచాయతీలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు మీడియాకు అందించిన రహస్య సమాచారం మేరకు.. మర్రి మాకులపల్లి సమీపంలో గానుగుచింత రోడ్డు పక్కన పెద్దకరివేపాకు గుట్టకు ఎదురుగా ఉన్నటువంటి చిన్నమల్లుకుంట పై అదే గ్రామానికి చెందిన కొంతమంది కన్ను పడింది. దీంతో రెవెన్యూ సహకారంతో చిన్నమల్లు కుంట నీటి చెరువును వారం రోజుల కింద ట్రాక్టర్లతో మట్టి తోలి చదును చేసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. దీనిపై స్థానికులు సమాచారం అందించడంతో పరిశీలించగా రెవెన్యూ రికార్డు ప్రకారం ఆక్రమించుకున్న భూమి చెరువు (చిన్నమల్లు కుంటచెరువు)గా రికార్డుల్లో ఉంది. దశాబ్దాల కాలంగా పేద రైతులు ఈ చెరువు నీటిని ఉపయోగించుకొని పంటలు పండించుకుంటున్నారు. అలాంటి చెరువును ఈరోజు రెవెన్యూ అధికారుల సహకారంతో చెరువులో మట్టి తోలి చదును చేసి ఆక్రమించుకుంటున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఆక్రమించుకున్న చెరువు భూమి దాదాపు 5 ఎకరాలు ఉంటుందని అంచనా. దీనిపై సంబంధిత రెవెన్యూ అధికారిని వివరణ కోరగా పొంతనలేని సమాధానం చెబుతూ మాట దాటవేయడం గమనార్హం. అయితే రెవెన్యూ అధికారుల సాక్షిగానే విఆర్‌ఒకు భారీగా ముడుపులు అందించే చెరువును పూడ్చి ఆక్రమించుకునే ప్రయత్నం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు విచారణ జరిపి చెరువును కాపాడాలని, లేనిపక్షంలో ఆర్‌డిఒ, కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

రేణిగుంట విమానాశ్రయం వద్ద చంద్రబాబును కలిసిన కుప్పం నియోజకవర్గ నేతలు



నేడు శ్రీవారిని దర్శించుకోనున్న చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుమల

టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చెరుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి రాత్రి గాయత్రి నిలయంలో బస చేశారు. తిరుమల సంప్రదాయం మేరకు శుక్రవారం ఉదయం ముందుగా వరాహస్వామి వారిని చంద్రబాబు దర్శించుకోనున్నారు. ఉదయం 7.30 గంటలకు శ్రీవారిని దర్శించుకోనున్నారు. దర్శనానంతరం గాయత్రి నిలయంలో కాసేపు విశ్రాంతి తీసుకుని, 9.30 గంటలకు తిరుమల నుంచి రేణిగుంట విమానాశ్రయానికి బయల్దేరి వెళతారు. రేణిగుంట నుంచి విజయవాడకు వెళ్లనున్నారు. డిసెంబర్ రెండో వారంలో తన నియోజకవర్గమైన కుప్పంలో చంద్ర బాబు పర్యటించనున్నారు.

తిరుమలలోనే రాత్రికి బస స్వాగతం పలికిన జిల్లా నేతలు

తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి కుటుంబ సమేతంగా తిరుపతికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ రేణిగుంట విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. కుప్పం నియోజకవర్గ విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు , సభ్యులు కన్నన్, రాజారామ్, జయ రామన్న, బాలాజీ, బాబు, రామచంద్రలు చంద్రబాబును కలిసారు. చిట్టమూరు మండల అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు రేణిగుంట విమానాశ్రయం వద్ద స్వాగతం పలికారు. ఆయనతో పాటు గుంపర్ల చిన్నారావు, ఎస్‌కె రషీద్, కమతం పోలయ్య, ఆరూరు గిరిబాబు నాయులు పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న పసుపులేటి హరిప్రసాద్

ఘనంగా భక్త కనకదాస జయంతి వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కర్ణాటక రాష్ట్రంలో ప్రాముఖ్యత కలిగిన కవి భక్త కనకదాస అని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ తెలిపారు. కనకదాస జయంతి సందర్భంగా గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో భక్త కనకదాస జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్త కనకదాస చిత్రపటానికి జిల్లా కలెక్టర్, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, బిసి వెల్ఫేర్ అధికారి రబ్బాని బాషా, బిసి కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ అమరనాథ్, తదితరులు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కనకదాస కన్నడ నాట గొప్ప కవి అని, దైవ చింతనలతో గొప్ప కావ్యాలను రచించారని, తత్వవేత్త అని అన్నారు. కర్ణాటక రాష్ట్రం ఉడిపి దేవాలయంలో కనకదాసకు శ్రీకష్ణుడు దర్శనభాగ్యం కల్పించినట్లు చెప్పుకుంటారన్నారు. కనకదాస పేరు పైన ఉడుపిలో స్థూపం ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా కనకదాస జయంతి కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బిసి సంక్షేమశాఖ అధికారులు, సిబ్బంది, కురబ సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కనకదాస చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 2,3 తేదీలలో ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని, ప్రత్యేక శిబిరాలలో బిఎల్‌ఓలు అందుబాటులో ఉండి ఓటర్ల నుంచి క్లెయిమ్‌లను స్వీకరించాల్సిందిగా తెలిపామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక శిబిరాల నిర్వహణను మండల తహశీల్దార్లు, ఆర్‌డిఓలు, ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ – 2024లో భాగంగా 2023 అక్టోబర్ 27న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కావడం జరిగిందని, అందులో ఓటు లేకుంటే డిసెంబర్ 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 1, ఏప్రిల్ 1, అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే వారు ఈ ఏడాది డిసెంబర్ 9 లోగా ఫారం–6 కింద ఓటరుగా దరఖాస్తు చేసుకోవచ్చునని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

టూ టౌన్ సిఐగా ఉలసయ్య

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చిత్తూరు నగర టూ టౌన్ సర్కుల్ ఇన్స్పెక్టర్‌గా ఉలసయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజారక్షణ వ్యవస్థలో కీలకంగా వ్యవహరిస్తున్న పోలీసులకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. నేరాలు, అక్రమ రవాణా అరికట్టేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.



టూ టౌన్ సీఐ బాధ్యతలు స్వీకరిస్తున్న ఉలసయ్య

గొర్రెల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి

జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పశువర్ధక శాఖ సంచాలకులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: గొర్రెల పెంపకంలో తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు ప్రభాకర్ అన్నారు. సహాయ సంచాలకులు విజయ్ మోహన్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో గొర్రెల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభదాయకమైన గొర్రెల పెంపకాన్ని చేపట్టాలని, గొర్రెల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. రైతులు మందలో జాతి లక్షణాలు కలిగిన విత్తనపు పొట్టేలు ఉండేలా చూసుకోవాలని అంటువ్యాధుల భారిన పడిన జీవాలను మంద నుండి వేరు చేసి చికిత్స అందించడం ద్వారా గొర్రెల మరణాల శాతం తగ్గించవచ్చని తెలిపారు. గొర్రెలలో పారుడు వ్యాధి, గాలికుంటు వ్యాధి, చిటుక రోగం, బొబ్బవ్యాధి, నీలి నాలుక, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్ వంటి వ్యాధులపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. నంద్యాల జిల్లా, ప్యాపిలికి చెందిన పశు వైద్యులు డాక్టర్ శ్రీనివాసులు, మాస్టర్ ట్రైనర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు అమర్నాథ్, మోహన్ బాబు, గొర్రెల పెంపకదారులు, పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

2న సామాజిక తనిఖీ బహిరంగ సభ

ప్రజాశక్తి- నగరి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద 2022 ఏప్రిల్ 1 నుండి 2023 మార్చి 31 వతేదీ వరకు 21 గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనులపై జరిగిన 16వ విడత సామాజిక తనిఖీ నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో లీలామాధవి ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక తనిఖీలో కనుగొన్న అంశాలపై బహిరంగ సభ డిసెంబర్ 2వ తేదీన జరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కరుణ కుమార్

జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ కరుణకుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సుప్రీం కోర్టు ఉత్తర్వులు, రాష్ట్ర హైకోర్టు సూచనలు మేరకు ఈనెల 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి డాక్టర్ ఐ.కరుణ్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవ సధన్ భవనంలో డిసెంబర్ 9న జిల్లాలో నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ నిర్వహణపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ వివిధ కోర్టుల్లో అనేకమైన కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, కోర్టులో వేయని వివాదా కేసులు ఉంటే అవి కూడా ముందస్తు పిటిషన్స్ ఫిర్యాదుగా స్వీకరించి సమన్యాయం అందించుటకు ఈ లోక్ అదాలత్ మంచి పాత్రను పోషిస్తుందన్నారు. కోర్టులలో తీర్పు చెప్పినప్పుడు ఒకరు విజయం సాధిస్తే మరొక్కరు అపజయ అవుతారని, దీనికి విభిన్నమైన రీతిలో లోక్ అదాలత్‌లో కక్షదారులు మధ్యవర్తిత్వం ద్వారా మాట్లాడుకోవడంతో వివాదాన్ని సున్నితంగా పరిష్కారం చేసుకోవడం జరుగుతుందన్నారు. రాజ్యాంగం ప్రజలకు కల్పిస్తున్న సమన్యాయం, సామాజిక న్యాయం, సత్వర న్యాయం కోసం సుప్రీంకోర్టు వారు అనేక సందర్భాలలో కక్షదారులకు సత్వర న్యాయం అందించుటకు లోక్ అదాలత్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. గత సెప్టెంబర్ మాసంలో జిల్లాలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో సుమారు 18 వేలపై చిలుకు వివిధరకాల కేసులను పరిష్కారం ద్వారా రూ.34 కోట్లు రికవరీ చేసి రాష్ట్ర స్థాయిలో చిత్తూరు జిల్లా మూడవ స్థానంలో ఉందన్నారు. 9న నిర్వహించే లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, న్యాయవాదులు, రెవెన్యూ, పోలీసు, బ్యాంకు అధికారులు, చిట్‌ఫండ్ కంపెనీలు, బీమా సంస్థ ప్రతినిధులు, కక్షదారులు పాల్గొని జిల్లాలో ఎక్కువ కేసులు పరిష్కరించి చిత్తూరు జిల్లాను రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో ఉండేలా సహకరించాలని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి: జడ్పీ సీఈఓ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్‌పి సీఈవో ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం పెనుమూరు మండలం తాటిమాకులపల్లి ఎర్రమట్టిపల్లి, గుంటిపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈఓ మాట్లాడుతూ అర్హత ఉన్నా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందలేని వారికి పథకాలు అందించేందుకు ఈప్రత్యేక కార్యక్రమంను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. గ్రామ పంచాయతీలలో ఉండి ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉన్న అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి పథకాలు అందేలా చూడడమే ఈకార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో భాగంగా హెల్త్‌కార్డులను పంపిణీ చేశారు. ఎంపీడీఓ నీలకంఠేశ్వర్ రెడ్డి, ఎంపీపీ హేమలత, జడ్పిటిసి దొరస్వామి అధికారులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతానుసారం అభివృద్ధి పనులు

మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం

పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

ప్రజాశక్తి- నగరి


ప్రాధాన్యతానుసారం అన్ని వార్డులలోను అభివద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. గురువారం నగరి మున్సిపల్ కార్యాలయంలో ఆయన మున్సిపల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కెఎల్‌ఎన్. రెడ్డి సమావేశపు అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏవైనా అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. ఈసందర్భంగా వైస్‌ఛైర్మన్ వెంకటరత్నం, విప్ దయానిధి, కౌన్సిలర్లు భారతి, గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య వార్డుల్లో చేపట్టవలసిన రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, జగనన్న కాలనీలలో పరస్పర స్థలమార్పు తదితర సమస్యలను కౌన్సిల్ దష్టికి తీసుకువచ్చారు. వాటికి కమిషనర్ సమాధానమిస్తూ అన్ని సమస్యలు నమోదు చేసుకున్నామని వాటిని పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు, లైన్లమార్పునకు సబంధించి ట్రాన్స్‌కో ఏడీ సమాధానమిచ్చారు. జగన్న కాలనీలో ఇంకా ఇల్లు నిర్మించుకోని లబ్దిదారుల వివరాలు తెలపాలన్నారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం మాట్లాడుతూ మంత్రి ఆర్కేరోజా సహకారంతో మున్సిపల్ పరిధిలో అన్ని వార్డుల్లోను ప్రాధాన్యతానుసారం ప్రజావసరాలకు తగిన విధంగా అభివద్ధి పనులు చేస్తూ వెళుతున్నామన్నారు. గడపగడపకు నిధుల ద్వారా 16,21 వార్డులలో రూ.40లక్షల మేర రోడ్లు, కాలువలు, కల్వర్టు, నీటిసరఫరా పనులు చేపడుతున్నామన్నారు. ఇలా అభివద్ధి పనులు చేసుకుంటూ ముందుకు వెళుతున్నామన్నారు. కాగా పుదుపేట నార్త్ అర్బన్ హెల్త్‌సెంటర్‌కు ప్రధాన రహదారిలో నేమ్‌బోర్డు ఏర్పాటుకు, సంతమైదానం వద్ద కొత్తగా నిర్మిస్తున్న కాంప్లెక్స్‌కు తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుచేయుటకు, వీధి దీపాల నిర్వహణకు రూ.99వేల వ్యయంతో స్పేర్‌పార్ట్స్ కొనుగోలు చేయుటకు, 45 జీరో అసెస్‌మెంట్లను పరిష్కరించుటకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వైస్‌ఛైర్మన్ బాలన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

డిఆర్‌డిఏ పీడీ తులసి



సంఘ మహిళలు, సీసీలతో మాట్లాడుతున్న పిడి తులసి

ప్రజాశక్తి- చిత్తూరు: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా కృషి చేయాలని డిఆర్‌డిఏ పిడి తులసి తెలిపారు. గురువారం డిఆర్‌డిఏ సమావేశపు మందిరంలో జగనన్న పాలవెల్లువలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులవారి అధ్యక్షతన డిఆర్‌డిఏ, మండల ఏపిఎంలు, సిసిలు, మండలస్థాయి పశు సంవర్ధక శాఖ సిబ్బంది, జిల్లా సహకార సంఘం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పిడి మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు, ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాలన్నారు. జగనన్న పాలవెల్లువలో పశువుల కొనుగోలునకు బ్యాంకుల సహకారంతో లోన్లు మంజూరుపై శిక్షణ ఇవ్వడం, దీనిలో భాగంగా వైఎస్‌ఆర్ చేయూతలో లబ్ధి పొందిన సంఘ సభ్యులకు ఇది వరకే పశు వులున్న వారికి, కొత్తగా కొనుగోలు చేయుటకు బ్యాంకుల ద్వారా అనుసంధానం చేయించడం జరుగుతుందన్నారు.

నేడు ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఓటు హక్కు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించడంలో భాగంగా చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ర్యాలీ, ద్విచక్ర వాహనాల ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించడం కోసం వార్డు కార్యదర్శులు, నగరపాలక సంస్థ, మెప్మా ఉద్యోగులు శుక్రవారం ఉదయం 9 గంటలకు చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయం నుండి గాంధీ విగ్రహం వరకు మెగా ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సోమలలో మంత్రి పర్యటన

ప్రజాశక్తి- సోమల: పుంగనూరు నియోజకవర్గ శాసనసభ్యులు, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేడు శుక్రవారం సోమల మండలంలో పర్యటించి పలు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేసి బహిరంగ సభలో పాల్గొననున్నట్లు జెడ్పిటిసి కుసుమా మోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ఎస్.నడింపల్లి పంచాయతీ సూరయ్యగారిపల్లి వద్ద నూతన సచివాలయ భవన ప్రారంభోత్సవం, 9 గంటలకు ఆవులపల్లి గ్రామ సమీపంలోని సోమేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం భూమిపూజ, 9.30 గంటలకు పెద్దఉప్పరపల్లి – నాయన పాకాల మీదుగా చిత్తూరుకు నూతన బస్సు సర్వీసు ప్రారంభం, పుంగనూరు నుండి చౌడేపల్లి – తమ్మినాయునిపల్లి, కందూరు, కలికిరి మీదుగా తిరుపతికి నూతన బస్సు సర్వీసు ప్రారంభం, ఉదయం 10 గంటలకు పేటూరు పంచాయతీ భోనమంద గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్వోప్లాంట్ ప్రారంభం, వైయస్సార్‌సిపి జెండా ఆవిష్కరణ, బహిరంగసభ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని తెలిపారు. మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని వైస్‌ఎంపీపీ ప్రభాకర్, ఎంపీటీసీ సర్వేస్వరి, వేముల హరి, సర్పంచులు వనజమ్మ, వెంకటరమణ, రెడ్డప్ప, నాయకులు రమణారెడ్డి, రాజారెడ్డి, వాసుదేవయ్య కోరారు.

జాతీయ స్థాయి క్రీడాపోటీలకు 'రక్షణ్'



ప్రజాశక్తి- నగరి: స్థానిక నారాయణ పాఠశాలలో చదువుతున్న రక్షణ్ అనే విద్యార్థి జాతీయ స్థాయి ఎస్‌జిఎఫ్ బాల్ బ్యాట్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారని డిజిఎం కొండలరావు తెలిపారు. దీంతో రక్షణ్‌ను ఆయన పతకంతో సత్కరించి అభినందించారు. ఈటోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నారాయణ విద్యార్థి లక్ష్మీనరసింహారెడ్డిని ఏజీఎం కిషోర్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కార్తీక్, ఆర్ఐ కిరణ్, ఏఓ విజయ్, పిఈటీ పాండ్యన్‌లు పాల్గొన్నారు.

టేక్ హోమ్ రేషన్ తేదీల్లో స్వల్పమార్పు

ప్రజాశక్తి- నగరి

నగరి ఐసీడీఎస్ పరిధిలోని నగరి, విజయపురం, నింద్ర మండల పరిధిలోని 202 అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భవతులు, బాలింతలు, 1 నుంచి 3 సంవత్సరాల పిల్లలకు అందించే టేక్ హోం రేషన్ తేదీల్లో స్వల్పమార్పు జరిగిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.కష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 2023 నెలలో మొదట విడతగా 8వ తేదీన అంటే 2వ శుక్రవారం 3 కేజీల బియ్యం, 1 కేజీ కందిపప్పు, అరలీటరు నూనె, 13 కోడిగుడ్లు, 2.5 లీటర్ల పాలు, 2.5 కేజీల బాలామతం ప్యాకెట్లను అందిస్తామన్నారు. 2వ విడతగా డిసెంబరు 22వ తేదీన అనగా 4వ శుక్రవారం టేక్ హోం రేషన్ ద్వారా వైఎస్సార్ కిట్ కోడిగుడ్లు 12, పాలు 2.5 లీటర్ల పాలు లబ్ధిదారులకు అందిస్తామన్నారు. ప్రతినెలా 2వ శుక్రవారం, 4వ శుక్రవారం టేక్‌హోం రేషన్ ఉంటుందన్నారు. ఇది గమనించి పాటించాలన్నారు. సూపర్‌వైజర్లు శంకరమ్మ, శ్యామల, లక్ష్మి పాల్గొన్నారు.

మీరాసాహెబ్ పాళెంలో ప్రత్యేక వైద్యశిబిరం

ప్రజాశక్తి- నగరి: మండలంలోని మీరా సాహెబ్ పాళెం గ్రామంలో డెంగీ పాజిటివ్ కేసు ఒకటి నమోదు కావడంతో డీఎంవో డాక్టర్ రవిరాజు వైద్యబందంతో పాటు గురువారం మీరా సాహెబ్ పాళెంకు చేరుకున్నారు. డెంగీ పాజిటివ్ వచ్చిన వ్యక్తి నివాస ప్రాంతాలను పరిశీలించి అపరిశుభ్రంగా పరిసరాలను ఉంచుకోవడమే డెంగీ దోమ రావడానికి కారణమైందని తేల్చారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేయించారు. ప్రతి ఇంటికీ వెళ్లి జ్వరం వచ్చిన కేసులపై ఆరా తీశారు. డెంగీ దోమలు ఉత్పత్తి కావడానికి ఉన్న కారణాలను నివాశితులకు విశదీకరించారు. శుక్రవారం డ్రైడే పాటించాలని వారికి సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్‌యూవోలు, ఎంపీహెచ్‌ఈవో, ఎంపీహెచ్‌ఎస్, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను సన్మానించిన భాస్కర్



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండల నూతన తహశీల్దార్ జయంత్ కుమార్‌ను చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాటుగారి భాస్కర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈసందర్భంగా వారు విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజాసమస్యలను పరిష్కరించాలని భాస్కర్ నూతన తహశీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. వెదురుకుప్పంలో రైతులు తరచూ రెవెన్యూ సమస్యలతో పోలీసుస్టేషను, కోర్టుల చుట్టూ తిరగడం పరిపాటైపోయిందని, తద్వారా గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, ముఖ్యంగా రెవెన్యూ సమస్యల్లో గతంలో దళారులను నమ్మి ఎంతో మంది రైతులు మోసపోయారని, అలాంటి వారిని గుర్తించి వారిని అరికట్టాలని కోరినట్లు తెలిపారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: శ్రీకాళహస్తి మండలం జగ్గరాజుపల్లిలోని సెంట్ మార్కు చర్చిలో దైవ సేవకులు సదస్సును యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ బిషప్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ విచ్చేసి దైవ సందేశాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ దేవుడు ఎప్పుడూ జీరోని ఎన్నుకొని హీరోలుగా చేస్తారని, అందుకనే మొట్టమొదటి సువర్తమానాన్ని గొల్లలకి తెలిపారని, వారు కూడా ఆ వర్తమానాన్ని లోకమంతా ప్రచురము చేశారని తెలిపారు. అనంతరం దైవ సేవకులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. యుసిడబ్ల్యూఎస్ అధ్యక్షులు నక్కపాల్ మనోహర్, రెవరెండ్ విండోటి బాబు, పయ్యూరు మోహనయ్య, సి సాల్మన్ చలో మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కర్లపూడిలో ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-కోట: మండలంలోని కర్లపూడి పంచాయతి పరిధిలోని సర్వే నెంబర్ 108లో ఓపెన్ కాస్ట్ పద్ధతిలో 3,689 హెక్టార్ల విస్తీర్ణంలో చేపట్టే సిలికా శ్యాండ్ మైనింగ్ 41,800టన్నులు సంవత్సరానికి చేయు మైనింగ్ ప్రాజెక్ట్ గూర్చి పొల్యూషన్ శాఖ అధికారులు సమక్షంలో గ్రామస్థులుతో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి వారిచే పలు సంతకాలును స్వీకరించారు. అయితే ఈ సిలికా మైనింగ్ శ్రీ రంగస్వామి కుమారేషన్ వారిచే ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమంలో తహసిల్దార్ పద్మావతి, విఆర్‌ఓ శ్రీనివాసులు, వైసీపీ నాయకులు రాఘవరెడ్డి, మైనింగ్ నిర్వాహకులు మధురెడ్డి, ఎస్సై పుల్లారావు, పొల్యూషన్ అధికారులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు ప్రాంతాల్లో పంటపొలాలు నీట మునిగాయి. పలమాల ఆర్ అనంతపురం, వెస్వరత్తూరు, నెలవాయి, వేణుగోపాలపురం, కలివెట్టు, తలారివెట్టు గ్రామాల్లో వరి పైరు నీట మునిగింది. బీఎన్ కండ్రిగ, కనమనంటేడు, పదవమైలు, మతకముడి, కంచనపుత్తూరు గ్రామాల వేసిన మిరపంటలు వర్షానికి నీటమునిగింది. వాగులు, వంకలు, కాలువలు ఉదృతంగా ప్రవహిస్తున్నాయి.

విద్యాసామ్రగి పంపిణీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సీనియర్ పాత్రికేయులు వాటంబేటి రవి భార్య నాగేశ్వరి తృతీయ వర్ధంతి పురస్కరించుకొని విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. గురువారం మండలంలోని అమ్మపాళెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు,స్కెచ్‌పెన్నులు, పెన్సిళ్లు, స్వీట్లు పంచిపెట్టారు. తన సతీమణి వర్ధంతి నాడు తనవంతు సాయంగా ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు చేపడతానని రవి తెలిపారు. సర్పంచ్ అంకయ్య, వైసిపినాయకులు యుగంధర్‌రెడ్డి, నిషికేష్, పాత్రికేయులు నెల్లూరు శీను, ధనశేఖర్, చంద్రశేఖర్ గంధం చంద్ర, బాలు పాల్గొన్నారు.

రూ.22కోట్ల సంక్షేమ నిధులు మంజూరు :ఎమ్మెల్యే



బంగారుపాళ్యం సమావేశంలో మాట్లాడుతనన ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: గుంతూరు సచివాలయానికి రూ.22కోట్ల సంక్షేమ నిధులు మంజూరు చేసినట్టు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు తెలిపారు. గురువారం మండలంలోని గుంతూరు సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం వైఎస్ఆర్సిపి నాయకులు భాష్యం లోకేష్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంతూరు సచివాలయానికి దాదాపు రూ.22 కోట్ల రూపాయలతో సంక్షేమఫలాలు అందించినట్టు తెలిపారు. ప్రతి పేదవాడికి అభివద్ధి చెందాలని ఉద్దేశంతో పలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా రాబోవు ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలేరు రామచంద్రారెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్, మండల కోఆప్షన్ నెంబర్ ఫిరోజ్ అహ్మద్, మండల సర్పంచ్ల సంఘ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, ఏఎంసి ఉపాధ్యక్షులు సర్దార్, వైస్‌సర్పంచ్ ఈశ్వర్, సచివాలయ కన్వీనర్లు విజయ్, కిషోర్ కుమార్‌రెడ్డి వరప్రసాద్, భాష్యం శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు



బైరెడ్డిపల్లి సభలో మాట్లాడుతున్న ఎంపిపి రెడ్డప్ప

సోమల: ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజల మన్ననలను పొంది ముఖ్యమంత్రి వైఎస్.జగన్ ఘనత సాధించారని 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ సర్పంచ్ సిద్దులమ్మ అన్నారు. గురువారం పంచాయతీలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే గ్రామసభలో పాల్గొన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీలో ఇప్పటివరకు దాదాపు రూ.40లక్షల అభివద్ధి పనులు నిర్వహించడం జరిగిందని అన్నారు. జడ్పిటిసి అమాస కుసుమ మోహన్, వైస్ఎంపీపీ ప్రభాకర్, ఎంపీటీసీ సరస్వతమ్మ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: రాష్ట్రంలో సంక్షేమపథకాలు లబ్ధిదారులకు పారదర్శకంగా అందిస్తున్న ఘనత వైసిపికే సాధ్యమని బైరెడ్డిపల్లి ఎంపిపి రెడెప్ప పేర్కొన్నారు. గురువారం మండలంలోని బేలుపల్లి సచివాలయం పరిధిలో జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎంపిపి పాల్గొని మాట్లాడారు. ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నా, గ్రామాభివృద్ధి జరగాలన్నా మళ్లీ సిఎంగా వైఎస్. జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జెడ్‌పిటిసి కేశవులు, జెసిఎస్ కన్వీనర్ కార్తిక్, సచివాలయ కన్వీనర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారం కోసమే పౌరహక్కుల దినోత్సవం

ప్రజాశక్తి- యాదమరి

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజాసమస్యలను అధికారులు నేరుగా తెలుసుకుని సమస్య పరిష్కరించడం కోసమే పౌరహక్కుల దినోత్సవం జరుపుకుంటున్నామని తహశీల్దార్ హనుమంతు అన్నారు. గురువారం 14కండ్రిగ గ్రామపంచాయతీ, హరిజనవాడలో పౌరహక్కుల దినోత్సవం సమావేశం నిర్వహించారు. ఈసమావేశంకు పోలీసు, రెవెన్యూ, అభివద్ధి శాఖల అధికారులు పాల్గొన్నారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి మనిషి జీవించే హక్కులో భాగంగా పౌరహక్కులు ఏర్పడ్డాయని తెలిపారు. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయం ప్రతివ్యక్తికి అందించాలని భారత రాజ్యాంగ హక్కులు కల్పించబడిందని అన్నారు. పౌరహక్కుల్లో భాగంగా ప్రజల జీవన స్థితిగతులు తెలుసుకోవడం ఎక్కడైనా లోపాలుంటే ప్రభుత్వానికి తెలపడం ప్రభుత్వ అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలు అందని ప్రజలకు అందేలా చేయడం పౌరహక్కుల్లో భాగమేనని తెలిపారు. అనంతరం గ్రామస్తులు అర్హులైన వారికి ఇంటి స్థలాలు ఇప్పించాలని, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని అధికారుల దష్టికి తీసుకెళ్లారు. అధికారులు స్పందించి వాటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అభివద్ధి అధికారి శివరాజ్, గ్రామసర్పంచ్ తబ్రీస్, స్టేట్ మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ కబీర్, విలేజ్ రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి, దళిత నాయకులు మురుగేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో 'పొలం బడి'

ప్రజాశక్తి- శాంతిపురం: రాగి పంట సాగుపై మేలైన యాజమాన్య పద్ధతులతో పొలంబడి కార్యక్రమం ద్వారా సి.బండపల్లి, 64 పెద్దూరు, చిన్నూరు గ్రామాలలో రాష్ట్రస్థాయి సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ అధికారి పి.వెంకటరావు శాంతిపురం మండలంలో అమలవుతున్న పొలంబడి పొలాలను, నాణ్యత ప్రమాణాలు, రైతులు అవలంభిస్తున్న వ్యక్తిగత వన్యమగ సంరక్షణ, ఆపద విధివిధానాలు, పర్యావరణ పరిరక్షణ రైతు కూలీల సంక్షేమ విధివిధానాలు అవలంభించి మేలైన యాజమాన్య పంటను పండించిన రాగి పరిశీలించారు. అలాగే రాగి పంట నమూనాలు సేకరించి పరీక్ష నిమిత్తం పంపించామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏడీఏ అన్నపూర్ణాదేవి పొలంబడి నాణ్యమైన దిగుబడి ద్వారా రైతులు ఇతర దేశాలకు ఎగుమతి అవకాశం కల్పించే విధంగా చేసిన రైతులకు ప్రోత్సహించి కతజ్ఞతలు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి అపోజి రైతు పొలాల్లో ఎఫ్‌పిఓ ఆధ్వర్యంలో తనిఖీకి సహకరించి రాగి పంటను ఎగుమతికి అనుమతులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమార్ రాజా, ఎఫ్‌పిఓ ప్రెసిడెంట్ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌పిఓ కన్సల్టెంట్ కోటేశ్వరరావు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనత ఉన్న వారిని గుర్తించండి: ఎంఈఓ



ప్రజాశక్తి- యాదమరి: పాఠశాలలో విద్యార్థులందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో 4డి కార్యక్రమంలో భాగంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారని ఎంఈఓలు రుక్మిణీ, ప్రసాద్‌లు తెలిపారు. గురువారం యాదమరి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది విద్యార్థులకు వైద్యపరీక్షలు చేపట్టారు. సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చిన్నారులకు అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రక్తహీనత ఉన్న వారిని గుర్తిస్తే వారికి ఆహారం అందిస్తారని, అలా కాకుండా ఏదైనా చిన్నచిన్న సర్జరీలు అవసరమైతే ఉచితంగానే చేయించడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్క విద్యార్థిని తప్పనిసరిగా పరీక్షించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిరాజా, హెల్త్ సూపర్వైజర్ లక్ష్మీపతి, ఎంఎల్‌హెచ్‌పిలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి కార్డుకు ఉచిత బియ్యం అందాలి



ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలోని ప్రతి రేషన్‌కార్డుదారుడికి ప్రభుత్వం అందిస్తున్న అన్ని సబ్సిడీ నిత్యావసర వస్తువులను ఎండియు ఆపరేటర్లు పంపిణీ చేయాలని మండల తహశీల్దార్ లోకేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డీలర్లు, ఎండియు ఆపరేటర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు నిత్యావసరాలను కార్డుదారులకు వారి గ్రామాల్లో క్లస్టర్ వారి ఐదు నుంచి పది చోట్ల ఎండియు వాహనం ద్వారా పంపిణీ చేయాలని ఆపరేటర్లను ఆదేశించారు. డీలర్లు ఎమ్మెల్యేస్ పాయింట్ నుంచి సరైన తూకంతో బియ్యం దిగుమతి చేసుకోవాలని ఆన్‌లైన్ స్టాక్‌రిపోర్ట్ మేరకు డీలర్ వద్ద బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు ఉండేటట్లు చూసుకోవాలని అన్నారు. అదేవిధంగా పోర్టబులిటీ కార్డులకు కూడా బియ్యం పంపిణీ చేయాలని ఎండియు ఆపరేటర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీలర్ సంఘం నాయకులు, ఎండియు ఆపరేటర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

విద్యుత్ స్తంభానికున్న తీగల తొలగింపు



ప్రజాశక్తి- వెదురుకుప్పం: గురువారం 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికపై ప్రజాశక్తిలో ప్రచురించిన వార్తకు విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. గురువారం విద్యుత్‌శాఖ అధికారి రామాంజనేయులు సిబ్బందితో మాంబేడు గ్రామం వద్ద విద్యుత్ స్తంభం చుట్టూ ఉన్న పొదలు, తీగలను తొలగించారు. అనంతరం ఇటువంటి సంఘటన పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యుత్, సచివాలయ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

చీరల పంపిణీ

ప్రజాశక్తి- శాంతిపురం: మండలంలోని కడపల్లి శ్యామరాజుపురం గ్రామంలో ఎమ్మెల్సీ కెఆర్‌జె.భరత్ సతీమణి దుర్గ గురువారం పర్యటించారు. ఆమెకు వైసిపి నాయకులు బుజ్జి స్వాగతం తెలిపారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి మహిళలకు పసుపు కుంకుమ, చీరను అందించారు. కుప్పం నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తున్నారని కావున, రాబోవు ఎన్నికలలో తన భర్త భరత్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జడ్పిటిసి శ్రీనివాసులు, మండల పార్టీ కన్వీనర్ దండపాణి, ఎంపీటీసీ అర్ముగం, చలపతి, మురుగేష్ పాల్గొన్నారు.

వరల్డ్ కంప్యూటర్ సెక్యూరిటీ డే సదస్సు



ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలనందు కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి పి.లావణ్య ఆధ్వర్యంలో వరల్డ్ కంప్యూటర్ సెక్యూరిటీ డే అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయాలు రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సాంకేతిక ఉపకరణాల వినియోగం అనివార్యం అని, కానీ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కళాశాల ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ సిఎన్.లత మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ పరికరాలను వినియోగించడంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యార్థులు సైబర్‌నేరాలకు సంబంధించిన తమ స్వానుభవాలను పంచుకున్నారు. రాజనీతి అధ్యాపకులు ఎస్.కార్తీక్, వ్యాయామవిద్య అధ్యాపకులు జోగి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కు పై అవగాహన

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ బెన్నురాజు అన్నారు. గురువారం మండలంలోని కొత్తపల్లిమిట్ట శ్రీవిశ్వేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థులకు ఓటు హక్కు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో 18 సంవత్సరాలు నిండిన వారు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగు విద్యార్థులకు ఓటు హక్కు గురించి వివరించి వారు గ్రామాల్లోని వారికి వివరించేలా అవగాహన కలించాలన్నారు. సర్వేయర్ మురళి, కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

జనరల్ న్యూస్



ఫర్నీచర్ తయారీ కేంద్రంలో

భారీ అగ్ని ప్రమాదం

రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి- వి.కోట: మండల కేంద్రమైన వికోటలో సమీపంలోని ఓ కోళ్ల ఫారంలో ఫర్నీచర్ తయారీ యూనిట్‌లో మంటలు చెలరేగి రూ.20లక్షలు మేర ఆస్తి నష్టం సంభవించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. కె.కొత్తూరుకు చెందిన సయ్యద్ పత్రపల్లి సమీపంలోని కెజిఎఫ్ రోడ్డులో గల కోళ్లఫారంలో ఫర్నీచర్ తయారీ యూనిట్‌ను నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో షెడ్డులో ఓ వైపు అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి, గాలి కారణంగా మంటల షెడ్డు మొత్తం వ్యాపించాయి. క్షణాల వ్యవధిలో షెడ్‌లోని ఫర్నీచర్ తయారీ సామగ్రి మొత్తం మంటల్లో కాలిబూడిదైంది. దట్టమైన పొగ పరిసరాల్లో వ్యాపించడంతో గమనించిన స్థానికులు యజమానికి తెలిపారు. కానీ అప్పటికే మంటలు ఎగసిపడుతూ ఫర్నీచర్ దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.20లక్షలు నష్టం వచ్చిందని యజమాని సయ్యద్ ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న ఫైర్ ఇంజన్ సిబ్బంది, పోలీసులు, విద్యుత్‌శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. స్థానికంగా ఫైర్‌స్టేషన్ అందుబాటులో లేకపోవడం, కుప్పం నుంచి సమాచారం తెలుసుకుని అగ్నిమాపక సిబ్బంది వచ్చే సమయానికి షెడ్డు పూర్తి కాలి బూడిదైందని బాధితులు వాపోయారు.

అక్రమ మద్యం పట్టివేత

మహిళ అరెస్ట్, మరొకరు పరారీ



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: అక్రమ మద్యం తరలిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్టు చిత్తూరు రూరల్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అక్రమ మద్యం తరలిస్తున్నట్లు ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు మండలంలోని టేకుమంద సమీపంలో గల కామాక్షిపురం క్రాస్ వద్ద తనిఖీలు చేపడుతుండగా ద్విచక్ర వాహనంలో ఒక తెల్లసంచిలో కర్ణాటక మద్యం బాటలను ఉంచుకుని తరలిస్తున్న టేకుమంద గ్రామానికి చెందిన రామ్మూర్తి కుమారుడు లోకేష్, అతని భార్య హరిత పోలీసులు చూసి వాహనాన్ని ఆపి లోకేష్ పరారయ్యాడు. హరితను అదుపులో తీసుకుని విచారించగా కర్ణాటక రాష్ట్రం నుండి 96 టెట్రా ప్యాకెట్లను తరలిస్తున్నట్లు నేరం అగీకరించినట్లు తెలిపారు. దీంతో కేసు నమోదు చేసి కోర్టుకు పంపినట్లు తెలిపారు. అలాగే పరారైన లోకేషన్ గాలిస్తున్నట్టు తెలిపారు. ఈదాడుల్లో హెడ్ కానిస్టేబుల్ కష్ణయ్య, సుబ్రహ్మణ్యం గౌడ్, కానిస్టేబుల్ కిరణ్‌కుమార్, మమత, గాయత్రి, చంద్రకళ, రేఖ దినకర్ పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తికి జైలు శిక్ష



ప్రజాశక్తి- నగరి: బంగారు నగల చోరీ కేసులో గుండ్రాజుకుప్పం గ్రామానికి చెందిన జీఏ సాయికుమార్ (22)కు జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ విష్ణువర్మ 6నెలల జైలు శిక్ష రూ. 2వేల జరిమానా విధించారు. సీఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు నగరి పట్టణంలో 2018లో జరిగిన చోరీ కేసును విచారించిన పోలీసులు సాయికుమార్‌ను అరెస్ట్ చేసి ఐపీసీ సెక్షన్ 380 రెడ్‌విత్ 411, క్రైం నెంబరు 79/2018 కింద కేసు నమోదు చేశారు. గురువారం ఈ కేసు నగరి కోర్టుకు విచారణకు వచ్చింది. ఏపీపీ రామశాంతి వాదనలు విన్న అనంతరం జడ్జి విష్ణువర్మ నిందితునికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. కోర్టు కానిస్టేబుల్ నవీన్‌కుమార్ ముద్దాయిని జిల్లా జైలుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- యాదమరి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు మృతి చెందిన సంఘటన చిత్తూరు - పరదారామి రోడ్డు, పిసిఆర్ గార్డెన్స్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు, వివేక్ (27) అగ్రహారం గ్రామం నుంచి రాత్రి సమయంలో నిర్లక్ష్యంగా బైక్‌ను నడుపుతూ అదుపుతప్పి వేప చెట్లను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలపై బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మతిచెందాడు. రోడ్డు ప్రమాద విషయంగా యాదమరి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- పెద్దపంజాణి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకునికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని బట్టందొడ్డి పంచాయతీ పరిధిలోని కొత్తూరు సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బట్టందొడ్డి పంచాయతీ కురప్పల్లి గ్రామానికి వాలంటరీగా పనిచేస్తున్న టి.కిరణ్ కుమార్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి తన ద్విచక్ర వాహనంలో వచ్చి గ్రామానికి వెళ్లుతుండగా, కరసనపల్లి గ్రామానికి చెందిన గణేష్‌రెడ్డి తన ద్విచక్ర వాహనంలో శ్రీరామపురం గ్రామానికి వస్తుండగా కొత్తూరు సమీపంలోని కోళ్ల ఫారాలు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వాలంటీర్ కిరణ్ కుమార్ తలకు తీవ్ర గాయాలు కావడంతో పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి వేలూరు సిఎంసి ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గాయపడిన గణేష్ రెడ్డి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

పచ్చికాపల్లంలో దొంగల 'హల్‌చల్'

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో వరుస చోరీలతో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. నిన్న, మొన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, జెసిబిల బ్యాటరీలు దొంగతనాలు మరువకముందే బుధవారం రాత్రి స్థానిక హరిత జ్యూవెలరీ దుకాణంలోకి చొరబడేందుకు యత్నించారు. స్థానికులు గుర్తించి అరవడంతో దొంగలు పరారయ్యారు. వరుస చోరీలతో మండల ప్రజలు భయాందోళనలకు గురి అవుతున్నారు. రాత్రి సమయాల్లో పోలీసుల నిఘా, గస్తీ సరిగా లేకపోవడంతోనే చోరీలు జరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు.

ఎయిడ్స్ పై ఆలోచింపచేసే చిత్రాలు

ప్రజాశక్తి- యాదమరి

వరల్డ్ ఎయిడ్స్ డే సదర్భంగా యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్ట్ మాస్టర్ కె.దామోదరాచారి ఎయిడ్స్ తాలూకు చిత్రాలను రూపొందించారు.

ఎయిడ్స్ రక్కసి కోరల్లో నేటి యువత

ఎయిడ్స్ రక్కసి కోరల్లో యువత చిక్కుకొని మత్యు అంచులలో అలమటించే దశ్యాన్ని ఎయిడ్స్ వ్యాపించే కారణాలను చిత్రంలో కళ్ళకు కట్టినట్లు చూపించారు.

ఏ పాపం ఎరుగని గర్భంలోని శిశువును సైతం కబళించే వైనం చిత్రంలో గమనించవచ్చు. (ఆక్రీలిక్ రంగులతో చిత్రించిన చిత్రం.

పతనం: యువత విషసర్పపు నీడలో, ఆకర్షణ ముసుగులో కామగ్నిలోపడి, మనోవికాసం లేక విషాదాన్ని కౌగిలించి పతనమయ్యే సన్నివేశాన్ని నీటిరంగులతో చిత్రించారు.

